సురక్షిత డ్రైవింగ్ చేయాలి : డీఎం

అవార్డులను అందజేస్తున్న ఎంవీఐ, డిపో మేనేజర్

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14 : డ్రైవర్లు సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని డిపో మేనేజర్ దేవరాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని డిపోలో డీఎం అధ్యక్షతన బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎంవీఐ నవీన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జనవరిలో ఎక్కువ ఆదాయం తెచ్చిన కండక్టర్లు, ఎక్కువ డీజిల్ ఆదా చేసిన డ్రైవర్లు, బెస్ట్ మెకానిక్‌లకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. మద్యం తాగి డ్యూటీకి రాకూడదని, సాధ్యమైనంత వరకు ప్రతి డ్రైవర్ బస్సును లెఫ్ట్ సైడ్‌లోనే నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎఫ్ భాస్కర్, బాల్‌రెడ్డి, ఏడీసీలు శ్రీనివాసులు, పరశురాం, యాయ్య, జలీల్ ఉన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం

ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 14 : జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ ఉమాశంకర్, ఎస్సై రిషికేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు భద్రతపై డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లను శాలువాలతో సన్మానించారు. 24 ఏండ్లుగా ప్రమాదాలు చేయకుండా ప్రయాణికుల మన్ననలు పొందిన డ్రైవర్ రామకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో యాదయ్య, డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్ ఉన్నారు.

పుల్వామ వీరజవాన్లకు ఘననివాళి

మౌనం పాటిస్తున్న యువకులు

వెల్దండ, ఫిబ్రవరి 14 : పుల్వామాలో పాకిస్తాన్ ఉగ్రవాదుల దొంగచాటున బాంబుబ్లాస్ట్‌కు అమరులైన వీర జవాన్ల త్యాగాలు వెలకట్టలేనివని మండల కేంద్రానికి చెందిన మాజీ సైనికుడు మట్ట చంద్రశేఖర్‌గౌడ్, యూత్ నాయకుడు రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పుల్వామ అమరులకు నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకురాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో మురళి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్

అచ్చంపేటరూరల్, ఫిబ్రవరి 14 : మున్సిపల్ సిబ్బంది బాధ్యతగా పనిచేసి ప్రజలనుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్ సూచించారు. బుధవారం డయల్ యువర్ చైర్మన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు శ్రీనివాసులు, అంతటి శివ, గౌరీశంకర్, రమేశ్‌రావు, మన్నుపటేల్, లావణ్య, మధునాగుల సంధ్య, టీపీవో మనోజ పాల్గొన్నారు.

పాశ్చాత్య సంస్కృతి తరిమికొట్టాలి

వాలెంటైన్స్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న దృశ్యం

అచ్చంపేటరూరల్, ఫిబ్రవరి 14 : దేశం నుంచి పాశ్చాత్య సంస్కృతిని తరిమికొట్టాలని బీజేవైఎం రాష్ట్ర నాయకుడు ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రేమికల దినోత్సవాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో వాలెంటైన్స్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అదేవిధంగా పుల్వామా దాడిలో వీర మరణం పొందిన సైనికులను స్మరిస్తూ నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు నెనావత్ రాకేశ్, శాంతన్, విజయ్‌కుమార్, నాగరాజుతోపాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్, కామర్స్, డిగ్రీ, పీజీ కళాశాలలో సంతూర్ ఉమెన్ స్కాలర్‌షిప్‌నకు సోని, పూజిత, సాబ్ కాతూన్, హసీనాబేగం ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌శర్మ తెలిపారు. స్కాలర్‌షిప్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ పాఠశాల, ఇంటర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాలల్లో చదివితేనే ఇందుకు అర్హులని తెలిపారు. డిగ్రీ పూర్తయ్యే మూడేండ్ల పాటు ఏడాదికి రూ.24 వేల చొప్పున విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తామని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకుల సమక్షంలో అభినందించారు.

పంటరుణాలను సకాలంలో చెల్లించాలి

ఉప్పునుంతల, ఫిబ్రవరి 14 : రైతులు పీఏసీసీఎస్‌లో తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లిస్తే అనుకోకుండా ఏదైనా సంఘటన జరిగితే వారికి వ్యక్తిగత ప్రమాద బీమా కింద రూ.2లక్షలు చెల్లించడం జరుగుతుందని పీఏసీసీఎస్ చైర్మన్ భూపాల్‌రావు తెలిపారు. బుధవారం సహకార కేంద్ర బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట రుణాలు పొంది సకాలంలో చెల్లించిన వారికి ప్రమాద బీమా వర్తిస్తుందన్నారు. విఘ్నేశ్వరపూర్‌కు చెందిన బొజ్జమ్మ 2023 ఏప్రిల్ 28 పిడుగుపడి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులకు బుధవారం రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం అభయ్‌కుమార్, డైరెక్టర్లు నారాయణరెడ్డి, శ్రీను, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

అచ్చంపేట, ఫిబ్రవరి 14: అచ్చంపేట మండలంలోని నడింపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీపంచమి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలోని సరస్వతీ విగ్రహానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు పంచమి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

చిన్నారులకు అక్షరాభ్యాసం

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రం సమీపంలోని కొల్లాపూర్ చౌరస్తా వద్ద ఉన్న జ్ఞాన సరస్వతీ ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆది పరాశక్తి, జ్ఞాన ప్రదాయిని మహా సరస్వతీదేవి అమ్మవారి దర్శనంతో అన్ని విద్యలు ప్రాప్తిస్తాయని, భక్తి పూర్వకంగా చిన్నారులు, భక్తులు వేలాదిగా దర్శించుకొని అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాభ్యాసం గావించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథం, ఈశ్వరయ్య, ఇందుమతి, కమిటీ సభ్యులు శేఖర్, శివశంకర్, బాలస్వామి, నారాయణరెడ్డి, వరలక్ష్మి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడింపల్లి పాఠశాలలో శ్రీపంచవి వేడుకలు

సరస్వతీదేవికి పట్టు వస్త్రాలు

శ్రీశైలం ఫిబ్రవరి 14 : శ్రీశైల దేవస్థానం ఆనవాయితీగా జరిపిస్తున్న సంప్రదాయం ప్రకారం వసంత పంచమి పర్వదినాన కొలనుభారతిలో కొలువైన సరస్వతీదేవికి పట్టువస్త్రాలు సమర్పించినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. బుధవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి పసుపు, కుంకుమ, గాజులు, ప్రత్యేక పుష్పాలు, ఫలాలను తీసుకుతెళ్లారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు సాములు, వైదిక సిబ్బంది పాల్గొన్నారు.

18న సీవోఈ సెట్ ప్రవేశ అర్హత పరీక్ష

అమ్రాబాద్, ఫిబ్రవరి 14 : తెలంగాణ గిరిజన సంక్షేమ ప్రతిభ గురుకుల కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం ఈనెల 18న సీవోఈ సెట్ అర్హత పరీక్ష ఉంటుందని టీజీడబ్ల్యూఆర్ జేసీ పీటీజీ బాలుర మన్ననూర్ ప్రిన్సిపాల్ పద్మావతి బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని మన్ననూర్ పీటీజీ పాఠశాల, కళాశాల పరీక్షా కేంద్రంలో 384మంది విద్యార్థులు అర్హత పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ముగిసిన తైబజార్ వేలం

బిజినేపల్లి, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని ఆనందగిరి లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయానికి సంబంధించిన జాతర వేలం పాట బుధవారం ముగిసింది. వేలంలో ఐదుగురు పాల్గొనగా బిజినేపల్లికి చెందిన అనిల్‌కుమార్‌గౌడ్ రూ.40.81లక్షలకు తైబజార్‌ను దక్కించుకున్నారు. ఏడాది పాటు పశువులు, కూరగాయల సంతలో తైబజార్ వసూలు చేయడంతోపాటు జాతర కూడా తైబజార్‌ను వసూలు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం తైబజార్‌ను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రాములునాయక్, పంచాయతీ కార్యదర్శి మహేశ్, శ్రీశైలం ఉన్నారు.

'బెస్ట్ అవేలబుల్'కు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 14: బెస్ట్ అవేలబుల్ స్కూళ్ల ఎంపికకు జిల్లాలోని ప్రైవేట్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ అధికారి రాంలాల్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. బెస్ట్ అవేలబుల్ స్కూల్స్ పథకంలో రెసిడెన్షియల్ విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, రెండు జతల దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, ప్రతి విద్యార్థికి రూ.42వేలు చెల్లిస్తుందని తెలిపారు. 2024 విద్యా సంవత్సరంలో డే స్కాలర్ విద్యార్థికి రూ.28 వేలు చెల్లిస్తుందన్నారు. ఈ పథకంలో మూడేండ్లు పూర్తయిన పాఠశాలలు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల కోసం కలెక్టరేట్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 19వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు.

కేంద్ర మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 14 : కేంద్ర మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామని సీపీఐ జిల్లా నాయకులు యేసయ్య, విజయుడు అన్నారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన దేశ వ్యాప్తంగా కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారానికి వచ్చి పదేండ్లు పూర్తయినా నేటికీ రైతులు, కార్మికుల సమస్యలను పరిష్కరించలేదన్నారు. 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల హామీలో చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని అని విమర్శించారు. కేంద్ర విధానాలకు నిరసనగా ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

సమతావాధికి ఘన నివాళి

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 14 : సమతావాధి మహోన్నత వ్యక్తి దామోదర సంజీవయ్య జయంతి వేడుకలను ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్, డాక్టర్ నర్సంహాశర్మ, బాలస్వామి, దేవన్ననాయుడు, బాలేమియా, పరమేశ్వరాచారి, సత్యంచారి ఉన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

బిజినేపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా నిత్యపూజా కార్యక్రమాలు, ప్రబంధ పారాయణం, హోమబలిహరణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చైతన్య మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో కోలాటం, ఎస్‌వీ కన్నారెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శన, సాయంత్రం తదితర హోమాలు నిర్వహించారు.

పాల్గొన్న భక్తులు

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాలెం వెంకన్న సన్నిధిలో ఎస్పీ

ఎస్పీని సన్మానిస్తున్న సిబ్బంది

బిజినేపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది, కమిటీ సభ్యులు ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఈవో రంగారావు, చైర్మన్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాసనసభలో అధికార పక్షం తీరు సరికాదు

వంగూరు, ఫిబ్రవరి 14 : కాంగ్రెస్ ప్రభుత్వంలో శాసనసభలో అధికార పక్షం వ్యవహరిస్తున్న తీరు సరికాదని వుందని కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలో కాకుండా కేవలం ప్రతిపక్ష పార్టీని విమర్శించడం కోసమే ఈ సమావేశాలను ఏర్పాటు చేసినట్లుందన్నారు. ఇచ్చిన హామీలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించకుండా ప్రజలను మభ్యపెట్టే విధంగా బడ్జెట్ ఉందన్నారు. శాసనసభలో బీఆర్ఎస్‌ను విమర్శించడానికి కేటాయించిన సమయం ప్రజల సంక్షేమం కోసం కేటాంచాలన్నారు.

కందనూల్ మున్సిపల్ కమిషనర్‌గా నరేశ్‌బాబు

నాగర్‌కర్నూల్ టౌన్, ఫిబ్రవరి 14 : నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్‌గా నరేశ్‌బాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న జయంత్‌కుమార్‌రెడ్డి అనారోగ్య సమస్యలతో వాలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకోగా ఇన్‌చార్జిగా మేనేజర్ యాదయ్యను నియమించారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా కరీంనగర్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నరేశ్‌బాబును నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీశైలంలో మహాశివరాత్రికి ఏర్పాట్లు

శ్రీశైలం, ఫిబ్రవరి 14 : శ్రీశైలంలో జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కాలినడకన వచ్చే భక్తులకు అవసరమయ్యే ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఈవో ఆదేశాల మేరకు అధికారుల బృందం బుధవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. ప్రధానంగా నాగలూటి పెద్దచెరువు నుంచి వచ్చే యాత్రికులు వెంకటాపురం, చామర్లకుంట, మఠం బావి, భీమునికొలను, కైలాసద్వారం మీదుగా వచ్చేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

లింగాల, ఫిబ్రవరి 14 : ప్రజలు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ కౌశల్ కిశోర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో సొసైటీ సోషల్ ట్రాన్స్‌ఫరేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌశల్ కిశోర్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని, ఆర్థిక వ్యవహారాలు రిజర్వు బ్యాంకు గుర్తించిన ఆర్థిక సంస్థల ద్వారా చేయాలని చెప్పారు. ఆర్థిక సంస్థల్లో మోసాలు జరిగితే రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ బ్యాంకింగ్ అబుడ్స్‌మన్ ద్వారా పరిష్కారం పొందవచ్చన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తి మృతి

వంగూరు, ఫిబ్రవరి 14 : నీటిసంపు మోటరు ఆన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఉల్పర గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం మండలంలోని ఉల్పరలో సయ్యద్‌ఇమ్రాన్ అహ్మద్ (33) తన ఇంటి వద్ద వున్న సంపులో మోటరు ఆన్ చేయగా నీరు రాక పోవడంతో మోటరును పట్టుకుని చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌దాఘాతానికి గురయ్యాడు. గమనించిన సోదరుడు సల్మాన్ వెంటనే అతడిని కల్వకుర్తి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి ఇంతియాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 14: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తెలకపల్లి మండలంలోని జమిస్తాపూర్ స్టేజీ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్సై గోవర్ధన్ కథనం మేరకు.. తెలకపల్లి మండలం కార్వంగకు చెందిన శంకరయ్య(38) బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా జమిస్తాపూర్ స్టేజీ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో శంకరయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జనరల్ దవాఖాన మార్చురీకి తరలించినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఉప్పునుంతల, ఫిబ్రవరి 14 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొనికే సు నమోదు చేసినట్లు ఏఎస్సై అంజయ్య తెలిపారు. బుధవారం ఉప్పునుంతల నుంచి అచ్చంపేటకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుకట్రాక్టర్ కంసాన్‌పల్లికి చెందిన గణేశ్‌దిగా గుర్తించినట్లు తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

బల్మూరు, ఫిబ్రవరి 14 : మండలంలోని కొండనాగుల గ్రామంలో రెండు రోజుల కిందట ఊశమ్మ ఇంటిలో రూ.20వేల నగదు, బంగారు ఆభరణాల చోరీ జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడు తిరుపతయ్యపై కేసు నమోదు చేసి బుధవారం అచ్చంపేట కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా జడ్జి నిందితుడికి 14 రోజుల రిమాండ్ చేసినట్లు తెలిపారు.

పట్టపగలే కానిస్టేబుల్ మొబైల్ చోరీ..

- నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో ఘటన
- నిందితుడిని పట్టుకున్న స్థానికులు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 14: కానిస్టేబుల్ జేబులోంచి సెల్‌ఫోన్ కొట్టేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పట్టపగలు చోటు చేసుకున్నది. వివరాలిలా.. అచ్చంపేటకు వెళ్లేందుకు నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న కానిస్టేబుల్ బాలయ్య జేబులో నుంచి ఓ దుండగుడు సెల్‌ఫోన్‌ను చోరీ చేశాడు. క్షణాల్లో గుర్తించిన కానిస్టేబుల్ అప్రమత్తమై తన ఫోన్ దొంగిలించారని గుర్తించాడు. బస్టాండ్‌లోని ప్రయాణికుల సహాయంతో వెంబడించి సెల్‌ఫోన్ దొంగను కానిస్టేబుల్ పట్టుకున్నాడు. ఆగ్రహానికి గురైన ప్రయాణికులు దొంగకు దేహశుద్ధి చేసిన అనంతరం పోలీసులకు అప్పగించారు.

సెల్‌ఫోన్ దొంగను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

కందనూలు డీఎస్పీగా బుర్రి శ్రీనివాస్

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 14: నాగర్‌కర్నూల్ డీఎస్పీగా బుర్రి శ్రీనివాస్ రానున్నారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న మోహన్‌కుమార్ డీజీపీ కార్యాలయానికి రిపోర్టు చేయాలని, ఆయన స్థానంలో రాచకొండ మహేశ్వరం ఏసీపీ బుర్రి శ్రీనివాస్‌ను డీఎస్పీగా బదిలీ చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసన్

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 14 : మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసన్ గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య బదిలీపై వెళ్లడంతో వికారాబాద్ జిల్లా పరిగి నుంచి శ్రీనివాసన్ బదిలీలపై రానున్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తి, ఫిబ్రవరి 14 : పట్టణంలోని వడ్డెర బస్తీకి చెందిన దివ్యాంగురాలు రజియాబేగానికి కుట్టుమిషన్ కోసం మిత్ర ఫౌండేషన్ సభ్యులు బుధవారం రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడాపోటీలు

కొల్లాపూర్ రూరల్, ఫిబ్రవరి 14 : సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా కొల్లాపూర్ పట్టణంలోని గిరిజన భవన్ వద్ద గిరిజనులకు గురువారం నుంచి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు బుధవారం మాట్లాడుతూ క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.వాలీబాల్, కబడ్డీ పోటీల్లో గిరిజన యువకులు పెద్దఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

ఎస్సైకి అభినందన

అచ్చంపేటరూరల్, ఫిబ్రవరి 14 : అచ్చంపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన రాములను బుధవారం వివిధ ప్రజా సంఘాల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అదేవిధంగా అయోధ్య బాలరాముడి చిత్రపటాన్ని బహూకరించారు. ఎస్సైని అభినందించిన వారిలో ప్రదీప్‌రెడ్డి, రాకేశ్‌నాయక్, భరత్, చందు, నాగరాజు తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చారకొండ, ఫిబ్రవరి 14 : ప్రభుత్వం ఆరుగ్యారెంటీల్లో గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఏఈ జానకిరాంనాయక్ పేర్కొన్నారు. బుధవారం తుర్కలపల్లి, చారకొండ, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో విద్యుత్ వినియోగదారుల వివరాలు నమోదును ఆయన పరిశీలించారు. వినియోగదారులు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు వివరాల నమోదు చేసుకోవాలన్నారు. అర్హులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది బాలునాయక్, రాజునాయక్ పాల్గొన్నారు.

'పీఎం కిసాన్'కు ఈకేవైసీ చేయించాలి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 14: ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకానికి సంబంధించి ప్రతి ఏడాది రైతు పెట్టుబడి సాయం అందుకునేందుకు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు సూచించారు. రైతులు తమ ఆధార్‌ను బ్యాంకు ఖాతాకు లింక్ చేయించుకోవాలని తెలిపారు. ఈకేవైసీ చేయించుకునేందుకు ఈనెల 22వ తేదీ వరకు సమయం ఉన్నదన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

తాడూరు, ఫిబ్రవరి 14 : 18 ఏండ్ల వయసు నిండిన వారు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ తాసీల్దార్ మహ్మద్ అలీ అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు నెలల కిందట అర్హులనుంచి ఓటరు నమోదుకు దరఖాస్తులు స్వీకరించారు. ఈక్రమంలో ఓటరు లిస్ట్‌లో నమోదైన పేర్లను బుధవారం ప్రతి గ్రామ సచివాలయంలో చదివి వినిపించినట్లు డీటీ తెలిపారు. మండలంలో మొత్తం 30,173మంది ఓటర్లు ఉండగా అందులో 15,126 మంది మహిళలు, 15,047 మంది పురుషులు ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో నూతనంగా దరఖాస